ప్రజా విశ్వంభర
V3 NEWS
లక్ష్యం సమాజహితం

# న్యాయస్థానాలు 'ఎన్నికల'ను పక్కనపెట్టిన వేళ!

**ఎన్నికల నిర్వహణపై ఈసీ కి విశేష అధికారాలు ఉన్నప్పటికీ.. నిబంధనల ఉల్లంఘన, అక్రమాలు జరిగినప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకునే వీలుంది. ఇందుకు సంబంధించి లోక్‌సభ/అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేసిన/స్టే విధించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అయితే, ఎన్నికల ప్రక్రియ పూర్తైన తర్వాత మాత్రమే వాటి ఫలితాలను సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో సవాలు చేసే వీలుంది. సంబంధిత వ్యక్తులు 'ఎన్నికల పిటిషన్' తోనే న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 329 ప్రకారం.. ఒకసారి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత, నిర్వహణ విషయంలో కోర్టులు జోక్యం చేసుకోలేవు. ఎన్నికల పిటిషన్లకు సంబంధించి గతంలో చర్యలు తీసుకున్న కొన్ని కేసులను పరిశీలిస్తే.**




**.ఇందిరా గాంధీ ఎన్నిక:** 1971 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజకవర్గంనుంచి ఇందిరాగాంధీ గెలుపొందారు. అయితే, ఆమె ప్రభుత్వ యం త్రాంగాన్ని దుర్వినియోగం చేసి గెలుపొం దారని ఆరోపిస్తూ ప్రత్యర్థి రాజ్‌నారాయణ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారించిన అలహాబాద్ హైకోర్టు..ఇందిరాగాంధీ ఎన్నికను రద్దు చేస్తూ 1975 జూన్ 2న తీర్పు వెలువరించింది. ఇది నాటి ఎమర్జెన్సీకి దారితీసింది.

**ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను:** 1977లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన సీహెచ్ మహ్మద్ కోయా, కే.ఎం.మణిల ఎన్నికను స్థానిక హైకోర్టు రద్దు చేసింది. ఎన్నికల ముం దు మతపరమైన ప్రచారానికి పాల్పడ్డారనే ఆరోపణలపై ఈచర్యలు తీసుకుంది.అప్పుడు వీరిద్దరూ ఏకే ఆంటోనీ ప్రభుత్వంలోమంత్రులుగా ఉన్నారు. అయితే, చివరకు సుప్రీం కోర్టు వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

**పిళ్లై వర్సెస్ జోస్ కేసు:** 1982లో కేరళలోని నార్త్ పరావుర్ నియోజకవర్గంలోని 50 పోలింగ్ స్టేషన్లలో తొలిసారి ప్రయోగాత్మకంగా ఈవీఎంలను ఉపయోగించారు. సీపీఐ నేత శివన్ పిళ్లై విజయం సాధించారు. అయితే, ఈవీ ఎంల వినియోగానికి చట్టపరమైన నిబంధన ఏమీ లేదని వాదిస్తూ ప్రత్యర్థి ఎ.సి జోస్ న్యాయస్థానంలో సవాలు చేశారు. విచా రించిన కోర్టు.. పిళ్లై ఎన్నికను రద్దు చేసి ఆ యాభై పోలింగ్‌స్టేషన్లలో రీపోలింగ్‌కు ఆదేశిం చింది. ఆ ఎన్నికలో జోస్ విజయం సాధించారు.

**ఎం.జే జాకబ్ కేసు 2006:** కేరళలో 2006 అసెంబ్లీ ఎన్నికల్లో పిరవోమ్ నియోజకవర్గం నుంచి ఎల్డీఎఫ్ అభ్యర్థి ఎం.జె జాకబ్ ఎన్నికయ్యారు. అయితే, ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘించారని.. ముఖ్యంగా ప్రత్యర్థి (టి.ఎం జాకబ్) ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రచారం చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును విచారించిన కేరళ హైకోర్టు ఎం.జె జాకబ్ ఎన్నికను పక్కనపెట్టగా.. ఈ తర్వాత హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధించింది.

**ఓపీ రవీంద్రనాథ్ కేసు:** 2019 లోకసభ ఎన్నికల్లో భాగంగా తమిళనాడులోని థేని నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఓపీ రవీంద్రనాథ్ ఎన్నికను మద్రాస్ హైకోర్టు 2023లో రద్దు చేసింది. పన్నీర్‌సెల్వం కుమారుడైన రవీంద్రనాథ్.. తన నామినేషన్ పత్రాల్లో ఆస్తులు, ఆదాయ వివరాలు దాచిపెట్టడంతోపాటు ఓటర్లకు ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించారని ఆరోపిస్తూ స్థానిక ఓటరు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. మద్రాస్ హైకోర్టు చర్యలు తీసుకోగా.. దానిపై సుప్రీం కోర్టు స్టే విధించింది.

# "ఆ ముగ్గురి"కి జీవితకాల రక్షణ !




ఆ ముగ్గురిని దేశంలోని ఏ న్యాయ స్థానం (మున్సిఫ్‌కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు) కూడా విచారించడానికి వీలు లేదు.ఏ పోలీసు స్టేషన్ లో కూడా వారిపై సివిల్, క్రిమినల్ కేసులు నమోదు కావు. ఒకవేళ కేసులు నమోదైనా ఏ కోర్టు కూడా వాటిని విచారించలేదు. వారి ఏ నిర్ణయాన్ని, చర్యనూ ఎవరూ ప్రశ్నించడానికి ఎంతమాత్రం వీలుకూడా లేదు.ఇంతకూ ఎవరా ముగ్గురు? వాళ్ళు అంత గొప్పవారా అంటే....వాళ్ళు ఆకాశం నుంచో అంతరిక్షం నుంచో ఊడి పడిన వారు ఏమీ కారు. అయోనిజులు(తల్లి గర్భం నుంచి జన్మించని వారు) కూడా కారు.దైవాశీశ సంబూతులు ఏమీ కారు.అవతార మూర్తులు కూడా కారు.వారికి మానవతాతీత శక్తులు కూడా వారికి ఏమీ లేవు. వారికి ఎలాంటి అదనపు అవయవాలు కూడా ఏమీ లేవు.సాధారణ మనుషుల మాదిరిగానే వారి శరీర నిర్మాణం కూడా ఉంది, ఉంటుంది. మన లాంటి మనుషులు అందరి లాగానే తల్లి గర్భం నుంచే వారు కూడా జన్మించారు. అసాధారణమైన వ్యక్తులు కూడా ఏమీ కారు వారు. కానీ ఈ దేశ ప్రభుత్వం వారిని ప్రత్యేక వర్గంగా పరిగణించింది.అందుకే వారికి ఈ రక్షణలను కల్పించింది.వారి కోసం ఈ దేశ పార్లమెంటు చేత ఒక చట్టానికి జీవిత కాలపు రక్షణను కల్పిస్తూ ఒక సవరణనే చేయించింది. ఇం తకూ వారు చేసే ఆ ప్రత్యేకమైన పని ఏమిటి? ఈ దేశంలోని పార్లమెంటు, అసెంబ్లీలకు ఎన్నికలను నిర్వహించడం ద్వారా ప్రభుత్వాలు ఏర్పడే విధి ని వారు నిర్వహించాలి.అది వారి రాజ్యాంగ విధి. ఈ దేశంలో ఎన్నికలను నిర్వహించే ఒక వ్యవస్థ ఉన్నది కదా.ఆ వ్యవస్థకు సారథ్య బాధ్యతల్లో ముగ్గురు కమిషనర్లు ఉంటారు కదా. వారి కోసమే ప్రభుత్వం ఈ చట్టాన్ని సవరించిందన్నమాట.2023 లో చేసిన ఈ సవరణ ప్రకారం ఆ ముగ్గురు కమిషనర్లు తమ పదవీ కాలంలో తీసుకున్న ఏ నిర్ణయాన్ని దేశంలోని ఏ వ్యవస్థ కూడా ప్రశ్నించడానికి ఎంత మాత్రం వీలులేద న్నమాట.సవరించిన ఈ చట్టంలోని సెక్షన్ 16 ప్రకారం పదవీ కాలంలో తీసుకున్న నిర్ణయాలు, చర్యలపై వారు జీవించి ఉన్నంత కాలం ఎలాంటి చర్యలు తీసుకోకూడద న్నమాట.అయితే ఈ దేశ రాజ్యాంగం పౌరులు అందరూ సమానులే అని చెబుతున్నది.రాజ్యాంగ పరిధిలో నిర్మించుకున్న చట్టాల ప్రకారం దేశంలోని పౌరులు ఎవరైనా నేరాలకు పాల్పడితే వారి హోదాలతో నిమిత్తం లేకుండా విచారణను ఎదుర్కొని తీరాలి.నేరం రుజువైతే వారి సామాజిక ఆర్థిక స్థాయి, అధికారిక హోదాలతోనిమిత్తం లేకుండాశిక్షకు అర్హులు అవుతారు అని రాజ్యాంగం చాలా స్పష్టంగా చెబుతున్నది. కానీ జరిగిన ఆ చట్ట సవరణ ఆ సమానత్వ సూత్రానికి అతీతంగా కనిపిస్తున్నది.ఈ ముగ్గురు దేశంలోని ఇతర పౌరులు అందరి కంటే అతీతులు, అధికులు, అసమానులు అని ఆ కొత్త చట్టం చెబుతున్నది.అంటే సవరించిన ఆ చట్టం ప్రకారం ఈ ముగ్గురు వ్యక్తులు రాజ్యాంగానికి అతీతమైన వారు అని చెబుతున్నది.రాచరిక, నియంతృత్వ వ్యవస్థల్లో కొందరు వ్యక్తులకు ఇలాంటి మినహాయింపులు వెసులుబాట్లు ఉండే అవకాశాలు ఉండేవి, ఉంటాయి కూడా.కానీ ఇండియాలో ఇప్పుడు రాచరిక వ్యవస్థ లేదు కదా. 1947 లో బ్రిటిష్ వలస ప్రభుత్వం అంతమై పోయింది. స్వతంత్ర దేశంగా ఏర్పడింది. దేశం రాసు కున్న రాజ్యాంగం 1950 లో అమలులోకి వచ్చింది.దాని ప్రకారం ఎన్నికలు జరుగుతూ ప్రభుత్వాలు ఏర్పతూ ఉన్నాయి. ప్రజలు తమ కోసం తమ ప్రతినిధులను ఎన్నుకొని వారి చేత ప్రభుత్వాలను నిర్మించుకుంటున్నాయి.ఇలాంటి ప్రాతినిధ్య ప్రజాస్వామిక వ్యవస్థలో కొందరికి ఇలాంటి జీవిత కాలపు రక్షణలను కల్పించడం ఒక వింతల్లో కెల్లా ఒక వింత అనే చెప్పాలి. ప్రపంచంలోనిఏ ప్రజాస్వామిక వ్యవస్థలో కూడా ఆ దేశ రాజ్యాంగానికి అతీత మైన వ్యక్తు లు ఉండరు. ఉండడానికి వీలు కూడా ఉండదు, ఉండ కూడదు కూడా. కానీ ఇక్కడ మాత్రం ఇలాం టి వెసులుబాట్లు,మినహాయింపులను ఆ ముగ్గురికీ కల్పించిందిఈదేశ ప్రస్తుత ప్రభుత్వం.



గోవర్ధన్ గంటె,
9347056621.

# రామాయణంలో పర్యావరణ పరిరక్షణ




మన భరతఖండం వేదభూమి, ధర్మభూమి, కర్మ భూమి ఈ భూమిలో అనంతమైన సాహిత్యం ఆవిర్భవించింది. మనలను మార్గదర్శనం చేసున్నది.అనాది కాలంనుంచీ వారసత్వ సంస్కృతీ సాంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు నెలవైన మన భరతభూమిలో ప్రాచీన కాలం నుంచి ఋషులు, మునులు, మహా కవులు అందించిన వేదాలు, పురాణాలు, సంహితలు, దేవీ దైవ సూక్తాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు, కావ్యాలు, శతకాలు, మొదలైన సమాజ హితాన్ని చేకూర్చే మన సాహిత్యం ఎంతో ఉన్నది.

పర్యావరణం: మన (జీవుల) చుట్టూ ఉన్న ఆవరించివున్న గాలి, నీరు, నేల, మొక్కలు, జంతువులు మరియు ఇతర భౌతిక, రసాయన, జీవిక పరిస్థితుల సమాహారాన్ని పర్యావరణం అంటారు.

సరళంగా చెప్పాలంటే, ఒక ప్రాణి మనుగడ సాగించడానికి మరియు వృద్ధి చెందడానికి దానికి తోడ్పడే లేదా దానిపై ప్రభావం చూపే బాహ్య పరిసరాలన్నింటినీ కలిపి పర్యావరణం అని పిలుస్తారు.

ప్రాచీన సాహిత్యంలో పర్యావరణ పరిరక్షణ కేవలం ఒక సిద్ధాంతంగా కాక, జీవన విధానంగా మరియు దైవత్వంతో కూడిన బాధ్యతగా కనిపిస్తుంది. వేదాలు, పురాణాల నుంచి ప్రబంధాల వరకు ప్రకృతిని పూజించదగిన తల్లిగా, రక్షించాల్సిన సంపదగా వర్ణించారు.

**పర్యావరణంలోని ప్రధాన భాగాలు..**

జీవ అంశాలు : చెట్లు, జంతువులు, మానవులు, పక్షులు మరియు సూక్ష్మజీవులు.

**నిర్జీవ అంశాలు :** గాలి, నీరు, సూర్యరశ్మి, నేల, ఉష్ణోగ్రత, ఖనిజాలు, మానవ జీవన వికాసోన్నతికి, ప్రాణి మనుగడకు, దోహదపడే ప్రకృతి రక్షణ, పర్యావరణ పరిరక్షణాంశాలను మన ప్రాచీన సాహిత్యంలో విశదీకరించిన విధానాన్ని తెలుసుకుందాం...

**1) రామాయణం లో ప్రస్థావించిన పర్యావరణ పరిరక్షణ అంశాలు**

వాల్మీకి రామాయణంలో ప్రకృతి కేవలం ఒక నేపథ్యం కాదు. రామాయణంలో ఒక సజీవ పాత్ర. చెట్లు, నదులు, పర్వతాలు, మూగజీవులను దైవసమానంగా ఆరాధించి కాపాడాలని రామాయణం స్పష్టం చేస్తుంది.

1. వృక్ష సంరక్షణ - తరువుల మహత్యం గురించి చెబుతూ వృక్షాలను నాటడం సంతాన ప్రాప్తి కంటే పవిత్రమైనదని చెప్పబడింది.

శ్లోకం:: "దశకూప సమా వాపీ దశవాపీ సమో హ్రదః
దశహ్రద సమః పుత్రో దశపుత్ర సమో ద్రుమః"( ఉత్తర కాండ )

తాత్పర్యం: పది బావులు ఒక దిగుడుబావితో సమానం; పది దిగుడుబావులు ఒక చెరువుతో సమానం; పది చెరువులు ఒక సత్పుత్రునితో సమానం; అటువంటి పదిమంది పుత్రులతో ఒక్క చెట్టు (ద్రుమః) సమానం. సమాజానికి ప్రాణవాయువును, నీడను, ఆహారాన్ని ఇచ్చే వృక్షాన్ని నాటడం ఎంతటి మహాపుణ్యమో ఈ శ్లోకం చెబుతున్నది.

**2. నదీ జలాల పవిత్రత - కాలుష్యం చేయరాదు.**

అయోధ్యా కాండలో గంగానదిని దాటే సమయంలో సీతాదేవి నదీమాతను ప్రార్థించిన

శ్లోకం: "నమస్తే భగవతి గంగే దేవి లోకనమస్కృతే
పుణ్యా త్వం భవ సుప్రీతా రామస్య పరిపాలనే" ( అయోధ్యా కాండ)

తాత్పర్యం: లోకమంతా పూజించే గంగాదేవిని సాక్షాత్తు అమ్మవారిగా పూజించారు. నదులను "జీవనాడులు"గా భావించి, వాటికి దైవత్వాన్ని ఆపాదించడం ద్వారా నీటిని కలుషితం చేయకుండా కాపాడాలనే పర్యావరణ నియమం ఇందులో దాగి ఉంది.

**3. సుభిక్షమైన రాజ్యం పచ్చదనంతోనే కలుగుతుంది.**

రాముని పాలనలో ప్రకృతి సమతుల్యత ఎలా ఉండేదో చూడండి.

శ్లోకం: "నిత్యపుష్పా నిత్యఫలాస్తరవః స్కంధవిస్తృతాః
కాలే వర్షీ చ పర్జన్యః సుఖస్పర్శశ్చ మారుతః" ( యుద్ధ కాండ )

తాత్పర్యం: చెట్లు ఎల్లప్పుడూ పూలతో, పండ్లతో, విస్తారమైన కొమ్మలతో పచ్చగా విలసిల్లేవి. కాలానికి తగినట్లుగా మేఘాలు వర్షాలు కురిపించేవి; వీచే గాలి ఆహ్లాదకరంగా, స్వచ్ఛంగా ఉండేది. ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా ఉండటమే ఆదర్శ సమాజానికి మూల లక్షణమని ఇది చాటుతోంది.

**4. జీవకారుణ్యం - ప్రకృతిని ధ్వంసం చేసేవారికి శాపం**

రామాయణ ఆవిర్భావమే ఒక పక్షి ప్రాణ సంరక్షణ వేదన నుంచి పుట్టింది. క్రౌంచ పక్షుల జంటలో ఒకదానిని వేటగాడు చంపినప్పుడు వాల్మీకి మహర్షి హృదయం ద్రవించి అప్రయత్నంగా వెలువడిన

శ్లోకం:: "మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః
యత్క్రౌంచమిథునాదేకమవధీః కామమోహితమ్" ( బాల కాండ )

తాత్పర్యం: అమాయక పక్షుల జంటలోని ఒకదానిని చంపిన వేటగాడికి శాశ్వత కీర్తి దక్కదని శపించారు. రామాయణం మొదలైన మొదటి శ్లోకమే "జీవహింసను నిరసిస్తూ, వన్యప్రాణులను కాపాడాలి" అనే గొప్ప సందేశాన్ని లోకానికి అందించింది.

**5. చెట్లను సైతం బాధపెట్టని కరుణ..**

రాముడు లక్ష్మణుడితో సీత గురించి చెబుతూ సీతాదేవి పంచవటి లోని లతలు, పుష్పాలు, జింకలను సొంత బిడ్డల వలె ప్రేమించేదంటూ

శ్లోకం::-- "ఏతే హి వృక్షాః సుమనఃసుగంధాః శోభంతి పద్మోత్పలసంవృతాని ।
పశ్య లక్ష్మణ పంపాయాః రమ్యతీరవనాని చ" (కిష్కింధా కాండ)

తాత్పర్యం: పంపా సరోవర తీరంలోని వృక్షాలు, తామరల సువాసనలను చూస్తూ రాముడు ప్రకృతి సౌందర్యాన్ని పరవశించి కొనియా డతాడు. మొత్తం మీద రామాయణంలో ప్రకృతిని దోచుకునే వస్తువుగా కాకుండా , ప్రేమించి సంరక్షించాల్సిన ఆత్మీయ నేస్తంగా రక్షించాలంటూ చెప్పడం జరిగింది.



అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు
సెల్ :8247433432
పశ్చిమగోదావరి జిల్లా ,ఆంధ్రప్రదేశ్.

# సీఈసీపై విజిలెన్స్ విచారణకు ఎందుకు ఆదేశించారు?

**ఒకవైపు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్?) ప్రక్రియ సహా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలక వ్యవహారాల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా ఒత్తిడి పెరుగుతోంది. ఇదే సమయంలో దాదాపు 20 ఏళ్ల కిందట జ్ఞానేశ్ కుమార్‌తో సంబంధం ఉన్న ఒక కేసును కేరళం ప్రభుత్వం మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. రాష్ట్ర హోం మంత్రి రమేశ్ చెన్నితల ఈ మేరకు సీఈసీపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలోనే 2006 నాటి సీఈసీ కేసు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అప్పట్లో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కేరళం ప్రజా పనుల శాఖ (- పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్) కార్యదర్శిగా ఉన్న సమయంలో కేరళం స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టును చేపట్టగా దానికి సంబంధించిన ఆరోపణలే ఈ విజిలెన్స్ విచారణకు కారణం. అప్పట్లో ఈ ప్రాజెక్టుకు పని చేసిన మలేసియా ఇంజినీర్ లీ సీ బీన్ ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితుల్ని కూడా అధికారులు ఇప్పుడు సమగ్రంగా పరిశీలించనున్నారు. ఈ తరుణంలో అసలు ఈ కేసు ఏంటి? అప్పట్లో విచారణ ఏమైంది? జ్ఞానేశ్ కుమార్‌పై ఆరోపణలు ఏంటి? ఇప్పుడు ఎందుకు ఆ కేసు మళ్లీ తెరపైకి వచ్చిందనేది చూద్దాం.**



**అసలు కేఎస్టీపీ కేసు ఏంటి?**

కేరళం రహదారులను ఆధునికీకరించడానికి వరల్డ్ బ్యాంక్ సహకారంతో చేపట్టిన ప్రాజెక్టే ఈ కేరళం స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్. ఇందులో భాగంగా కేరళం రోడ్ల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు రోడ్డు భద్రతను పెంపొందించడం, పీడబ్ల్యూడీ సామర్థ్యాన్ని బలోపేతం చేయడం వంటివి ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని పలు ప్రధాన రహదారులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అంగమాలీ నుంచి తిరువనంతపురం వరకు ఉన్న మెయిన్ సెంట్రల్ రోడ్‌ను పునర్నిర్మించడం, ఆధునికీకరించడం కూడా ఇందులో ఉంది. ఈ పనుల నిర్వహణ కోసం సుమారు రూ. 215 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను PATI- BELకు ఇచ్చినట్లు తాజా రిపోర్ట్స్ పేర్కొంటున్నాయి. ఇది మలేసియాకు చెందిన PATI, కొచ్చికి చెందిన భాగీరథ ఇంజినీరింగ్ లిమిటెడ్ (దీజూ) జాయింట్ వెంచర్. అలా రెండు సంస్థలు సంయుక్తంగా PATI- BEL పేరుతో ప్రాజెక్ట్ ప్రారంభమైంది.

**ఇంతకీ ఆ ప్రాజెక్టులో ఏం జరిగింది?**

ఈ క్రమంలోనే రహదారి ప్రాజెక్టుతో సంబంధం ఉన్న లీ సీ బీన్ అనే మలేసియా ఇంజినీర్ 2006లో మలేసియాలో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన ‡ PATI- BEL కన్సార్టియంలో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేశారు. ఆయన రాసినట్లుగా చెబుతున్న సూసైడ్ నోట్‌లో అప్పటి కేరళం పీడబ్ల్యూడీ అధికారుల పేర్లు ప్రస్తావించినట్లు ఆరోపణలు వచ్చాయి. అందులో అప్పటి పీడబ్ల్యూడీ కార్యదర్శిగా ఉన్న జ్ఞానేశ్ కుమార్ పేరు కూడా ఉందని పలు రిపోర్ట్స్ పేర్కొన్నాయి. ప్రాజెక్ట్ పనుల్లో ఇబ్బందులు సహా బిల్లుల క్లియరెన్స్‌లో జాప్యం, అధికారుల నుంచి డబ్బు డిమాండ్ చేశారన్న ఆరోపణలు కూడా అప్పట్లో వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే కేరళం హోం మంత్రి రమేశ్ చెన్నితల జ్ఞానేశ్ కుమార్‌పై విచారణకు ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో చేసిన ఆరోపణ లకు ఆధారాలు ఉన్నాయా లేదా అన్నది ఇప్పుడు విచారణలో కీలకంగా మారనుంది.

**అప్పట్లో విచారణ ఏమైంది?**

లీ సీ బీన్ సూసైడ్, కెఎస్టీపీ ప్రాజెక్టుకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో 2006 లోనే విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. అదే సమయంలో జ్ఞానేశ్ కుమార్‌ను పీడబ్ల్యూడీ విభాగం నుంచి కేంద్ర డిప్యుటేషన్‌పై బదిలీ చేసి పంపించారు. ఆ తర్వాత దర్యాప్తు ముందుకు సాగలేదని, మధ్యలోనే అసంపూర్తిగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఇప్పుడు కేరళం సర్కార్ 20 ఏళ్ల కిందటి పీడబ్ల్యూడీ రికార్డులతో పాటు అప్పట్లో విజిలెన్స్ విభాగం నిర్వహించిన ప్రాథమిక విచారణకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించనుంది. అసలు అప్పట్లో దర్యాప్తులో ఏం జరిగింది? ఏం నిర్ణయం తీసుకున్నారు? బయటినుంచి ఏమైనా ఒత్తిళ్లు వచ్చాయా? అన్న అంశాలను ఇప్పుడు పరిశీలించనున్నారు. అయితే ఈటీవీ భారత్‌తో తాజాగా మాట్లాడిన అర్బన్ ప్లానింగ్ ఎక్స్‌పర్ట్, తిరువనంతపురం రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఎండీ అనిల్ కుమార్ పండాలా - జ్ఞానేశ్ కుమార్‌ను ఒక ఆదర్శవంతమైన పీడబ్ల్యూడీ సెక్రటరీగా అభివర్ణించారు. గతంలో క్లిష్టమైన భూసేకరణ సమస్యల్ని పరిష్కరించడంలో ఆయన చూపిన చొరవ, తీసుకున్న చర్యలు ఎంతగానో సహా యపడ్డాయని చెప్పుకొచ్చారు.అయితే ఇప్పుడు సర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, ఇదే సమయంలో కేంద్ర ఎన్నికల కమిషన్‌లో సభ్యుల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నట్లు కథనాలు వచ్చిన నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. దీంతో సర్ ప్రక్రియలో సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటు న్నారన్న ఆరోపణల నడుమ ఆయనపై రాజ కీయ విమర్శలు కొనసాగుతున్న తరుణంలోనే కేరళం ప్రభుత్వం పాత కేసును మళ్లీ తెరమీదికి తీసుకొచ్చింది.

పోతుగంటి వెంకటరమణ
ఎగ్జిక్యూటివ్ ఎడిటర్
ప్రజా విశ్వంభర దినపత్రిక